వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు పాటించాలి

రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, అధికారులు

మంచాల, ఏప్రిల్ 16 : వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలను రైతులు తప్పనిసరిగా పాటించాలని మంచాల వ్యవసాయ శాఖ అధికారి జ్యోతిశ్రీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ విధానం ద్వారా రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నేలలో సేంద్రియ కర్బన పదార్థం పెంపొందించే విధానంపై శాస్త్రవేత్త డాక్టర్ ఉమారెడ్డి వివరించారు. వరి పంట కోత అనంతరం వరి కొయ్యలను రైతుల కాల్చి వేయకుండా భూమిలో కలియదున్నడం వల్ల కలిగే లాభాలను ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు సాయిసిరి, సరిత, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే లక్ష్యం

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న జడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్, ఏప్రిల్ 16 : ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరిని ఆదుకోవడమే రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ లక్ష్యమని జడ్పీటీసీ, రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ దశరథ్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని మైసిగండి గ్రామానికి చెందిన జటావత్ భీమానాయక్ సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ మంగళవారం ఉదయం స్థానిక నాయకులతో కలిసి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించాడు. అనంతరం బాధిత కుటుంబానికి ట్రస్టు తరపున జడ్పీటీసీ రూ.5 వేలు, మాజీ సర్పంచ్ తులసీరాంనాయక్ రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పాండు, గోపాల్, శ్రీను, ఛత్రు, రాజా పాల్గొన్నారు

దివ్యాంగులకు బస్‌పాస్‌ల పంపిణీ

ఆమనగల్లు(మాడ్గుల) ఏప్రిల్ 16 : మాడ్గుల మండల పరిధిలోని ఇర్విన్ గ్రామంలో మంగళవారం యారం జార్జిరెడ్డి సహకారంతో ఇర్విన్ గ్రామ పంచాయతీకి చెందిన 50 మంది దివ్యాంగులకు రాయితీ బస్‌పాస్‌లను అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పగడాల రవితేజ, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, బీఆర్ఎస్ నాయకులు రాజమోని జంగయ్య, కడారి మల్లయ్య, అల్లాజీ, రాము, కిరణ్ పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

ఐసీడీఎస్ సీడీపీవో రోజా

శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ అధికారులు

కడ్తాల్, ఏప్రిల్ 16 : మానవ అక్రమ రవాణాను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఐసీడీఎస్ సీడీపీవో రోజా, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ బలరాంకృష్ణ అన్నారు. మానవ అక్రమ రవాణాను అడ్డుకట్ట వేసేందుకు మహిళా శిశు సంక్షేమశాఖ-ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో రెండు రోజులుగా అంగన్‌వాడీ సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా సీడీపీవో రోజా మాట్లాడుతూ.. యువతులు సెల్‌ఫోన్లో వచ్చే రకరకాల యాప్‌లతో లైంగిక వ్యాపారానికి గురికావడం జరుగుతుందని, కొందరు ఫొటోలను మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్ చేసి వేధిస్తున్నారని వివరించారు. మానవ అక్రమ రవాణాను అరికట్టడానికి అంగన్‌వాడీలు ప్రత్యేక కృషి చేయాలని, మహిళలకు, చిన్నారులకు రక్షణ కవచంలా మారాలన్నారు. కుటుంబంలో అమ్మాయిల పట్ల ఉన్న వివక్షత తొలగిపోవాలని, కుటుంబ సభ్యుల్లో అవగాహన పెంపొందించడంతో పాటు ప్రజల్లో చైతన్యం కలిగించడం ద్వారా అక్రణ రవాణాకు అడ్డుకట్ట వేయవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శబరి, సరళ, ప్రజ్వల సిబ్బంది అంబర్‌సింగ్, సురేశ్, అనిల్, మిథాలీరాజ్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్‌ను వెతికి అప్పగించిన పోలీసులు

కొత్తూరు, ఏప్రిల్ 16: పోగొట్టుకున్న ఓ మొబైల్‌ను వెతికి తిరిగి అప్పగించారు కొత్తూరు పోలీసులు. ఈ సంఘటన కొత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పెంజర్లలో మంగళవారం జరిగింది. మండల పరిధిలో పెంజర్లలో బీరప్పస్వామి కల్యాణానికి వచ్చి ఓ వ్యక్తి ఫోన్ పోగొట్టుకున్నాడు. సమాచారం అందించిన వెంటనే పోలీసులు స్పందించారు. ఏఎస్ఐ అబ్దుల్లా సహకారంతో మొబైల్ ట్రాకింగ్ ఆధారంగా ఫోన్ గ్రామ శివారులోని కంకర కుప్పలో ఉన్నట్లు తేలింది. పడిపోయిన ఫోన్ తనకు అప్పగించినందుకు ఒగ్గు కళాకారుడు ఆంజనేయులు ఏఎస్ఐ అబ్దుల్లా, కానిస్టేబుల్ యాదగిరికి కృతజ్ఞతలు తెలిపారు.

నిరుపేద పెండ్లికి పుస్తెమెట్టెలు అందజేత

పెద్దఅంబర్‌పేట, ఏప్రిల్ 16: బీఆర్ఎస్ సీనియర్ నేత దండెం రాంరెడ్డి, మాధవి దంపతులు మరోసారి ఉదారత చాటుకున్నారు. దండెం యాదమ్మ, నారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదింటి ఆడబిడ్డ పెండ్లికి పుస్తె, మెట్టెలు, పట్టు వస్త్రాలు అందజేశారు. తుర్కయాంజాల్ మున్సిపాలిటీకి చెందిన అనూషది నిరుపేద కుటుంబం. తండ్రి చనిపోగా.. తల్లి ఒక్కరే ఐదుగురు పిల్లలను పోషిస్తున్నది. ఈ నెల 19న అనూష పెండ్లి చేయాలని నిశ్చయించి, సాయం చేయాలని దండెం రాంరెడ్డిని కోరారు. ఆయన వెంటనే స్పందించారు. మంగళవారం పెద్దఅంబర్‌పేటలోని ఇంట్లో రాంరెడ్డి, మాధవి దంపతులు తమ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరుపేద అనూష పెండ్లి కోసం పుస్తె, మెట్టెలు, పట్టు వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో పండుగల రాము, సత్యనారాయణ, పోశయ్య, సుమలత తదితరులు పాల్గొన్నారు.

స్థలం సరిపోక రోడ్డుపైకి చెత్త

మొయినాబాద్, ఏప్రిల్ 16 : మొయినాబాద్ గ్రామ పంచాయతీకి కేటాయించిన సర్వే నంబర్ 117లో కొంత స్థలాన్ని చెత్త డంపింగ్ యార్డుకు కేటాయించారు. స్థలం సరిపోకపోవడంతో చెత్త రోడ్డుపైకి వస్తున్నది. దీంతో అటు నుంచి వెళ్లే వారికి దుర్వాసన వస్తున్నది. పెరుగుతున్న జనాభాతో చెత్తను నిల్వ చేయడానికి స్థలం సరిపోకపోవడంతో ముస్తఫా కాలనీలకు వెళ్లే రోడ్డు పై గ్రామ పంచాయతీ సిబ్బంది పారబోసి వెళ్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు దృష్టి పెట్టి రెవెన్యూ అధికారులతో చేత డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించే విధంగా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అగ్ని ప్రమాదాల నివారణపై వివరిస్తున్న అధికారి భిక్షపతి

చేవెళ్లటౌన్, ఏప్రిల్ 16: అగ్ని ప్రమాదాల పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేవెళ్ల ఫైర్ స్టేషన్ అధికారి భిక్షపతి అన్నారు. అగ్ని మాపక వారోత్సవాల సందర్భంగా ఫైర్ స్టేషన్ సిబ్బంది మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయని, నివారణకు ప్రజలు ముందస్తు చర్యలు తీసుకోవాలని వివరించారు. అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు అధైర్య పడకుండా ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందివ్వాలన్నారు. కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ సిబ్బంది ప్రశాంత్, గోపాల్, సురేందర్, సిద్ధూ, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కడ్తాల్, ఏప్రిల్ 16 : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ కమ్లీమోత్యా నాయక్, జడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభ ప్రారంభంకాగానే ఎంపీటీసీలు వివిధ సమస్యలను ఏకరువు పెట్టారు. గ్రామాల్లోని బెల్ట్ షాపుల్లో మద్యం ఏరులై పారుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో స్త్రీ శక్తి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్నా పనులు ఎందుకు జరగడం లేదని జడ్పీటీసీ దశరథ్‌నాయక్ అధికారులను ప్రశ్నించారు. మండలంలోని చెరువులు, కుంటలకు సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించాలని పలువురు ఎంపీటీసీలు కోరారు. వివిధ గ్రామాల సమస్యలను ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు సభలో ప్రస్తావించారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని మేనేజర్ రాధిక తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో సుజాత, వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీలు లచ్చిరాంనాయక్, శ్రీనివాస్‌రెడ్డి, రాములుగౌడ్, మంజుల, ప్రియ ఉమావతి, నిర్మలమ్మ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నెట్‌పై అవగాహన అవసరం

వ్యవసాయ యూనివర్సిటీ, ఏప్రిల్ 16 : ఇంటర్నెట్‌పై అవగాహన ఎంత ఉంటే ప్రపంచం అంత దగ్గరగా ఉంటుందని విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. ఎం. వెంకటరమణ అన్నారు. రాజేంద్రనగర్ ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం ఇంటర్‌నెట్ , ఈ మెయిల్ సెక్యూరిటీపై వెబ్‌నార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..ప్రపంచమంతా ఇంటర్నెట్‌లో పొందుపర్చి ఉందని వాటిపై అవగాహన అవసరమన్నారు. అందులో మంచీ చెడులు అన్నీ ఉంటాయన్నారు. మరో పక్క సైబర్ నేరాలు పెరుగుతున్నాయని వాటి బారిన పడకుండా ఉండేందుకు ఇటువంటి వెబ్‌నార్ దోహదం చేస్తుందన్నారు. విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని కళాశాలల విద్యార్థులకు అధ్యాపకులకు ,ఇంటర్నెట్ ఈ మెయిల్ సెక్యూరిటీపై అవగాహన కల్పించేందుకు వెబ్‌నార్, సెమినార్‌లను నిర్వహించాలని సూచించారు. హైదరాబాద్ సి- డాక్ ప్రాజెక్టు మేనేజర్ ఎం. జగదీశ్ బాబు , ఇంటర్నెట్, ఈ మెయిల్ సెక్యూరిటీపై అవగాహన కల్పించారు. ఫేక్ మెసేజ్‌ల నుంచి ఎలా కాపాడుకోవాలో సూచించారు. ఈ మెయిల్‌లకు వచ్చే జంక్ మెసేజ్ లు, స్పామ్ మెసేజ్‌ల నుంచి ఎంత దూరంగా ఉంటే అంత మంచిదన్నారు . ఫేక్ యూఆర్ఎల్‌లను గుర్తించేందుకు అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లపై ఆయన అవగాహన కల్పించారు. ఈ మెయిల్ సెక్యూరిటీ ఆవశ్యకత గురించి కంప్యూటర్ సెంటర్ ఇన్‌చార్జి , ఇంటర్నెట్‌పై అవగాహన , మంచీ చెడులు యూనివర్సిటీ గ్రంథాలయ పాలకుడు డా. ఎన్. రవికుమార్ వివరించారు.ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి విద్యార్థికి ఇంటర్నెట్‌పై అవగాహన అవసరమన్నారు.

108 సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

కందుకూరు. ఏప్రిల్ 16 : 108 సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రంగారెడ్డి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు. మండల కేంద్రంలో గల 108, 102 అంబులెన్స్‌లను పరిశీలించారు. సిబ్బంది పనితీరు ఆక్సిజన్ సరఫరా, రికార్డులలను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. జిల్లా కో ఆర్డినేటరు రాంబాబు, ఈఎంటీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల ఆరోగ్యానికి భరోసా సీఎంఆర్ఎఫ్

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



లబ్ధిదారు కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్, ఏప్రిల్ 16: నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ సంపూర్ణ ఆర్థిక భరోసాను ఇస్తున్నదని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. పేదరికం ఏ ఒక్కరి అనారోగ్యానికి శాపం కావొద్దన్నదే ఈ పథకం ప్రధాన ఉద్దేశమన్నారు. మాదాపూర్ డివిజన్ సుభాష్ చంద్రబోస్ నగర్ కాలనీకి చెందిన రాధికకు అత్యవసర వైద్య సేవల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి రూ.35,000 ఆర్థిక సాయం నిధుల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే గాంధీ మంగళవారం తన నివాసంలో బాధిత కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం సహాయ నిధి ఆర్థిక సాయంతో నిరుపేదలు సైతం కార్పొరేట్ దవాఖానలలో వైద్య సేవలను పొంది తమ అనారోగ్యాలను దూరం చేసుకుంటున్నారన్నారు. కొండంత ధైర్యాన్ని బాధితులకు అందిస్తూ సేవలందిస్తున్నదని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. నిరంతర సేవల ద్వారా అభాగ్యులను ఆదుకుంటూ నేనున్నానంటూ భరోసాను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని ఎందరో పేదలు తమ అనారోగ్యాలను నయం చేసుకుని జీవనోపాధులతో కుటుంబంతో సంతోషంగా ఉంటున్నట్లు ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు సాంబశివరావు, అక్కారావు, రాములు, బుజ్జన్న, రామకృష్ణ, సత్యం, నర్సింహ, వెంకటేశ్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి శుభాకాంక్షలు

నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. అన్నదమ్ముల ప్రేమకు, తల్లిదండ్రుల గౌరవానికి, భార్య ప్రేమకు శ్రీరాముడు ఆదర్శప్రాయుడన్నారు. పెండ్లి వేడుకలు ఎలా జరగాలో సీతారామ కల్యాణం చెబుతుందని, ఆ ఆదర్శ సీతారామ దంపతులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని ఎమ్మెల్యే గాంధీ కోరారు. వాడవాడలా నవమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించుకోవాలని, అసౌకర్యాలు లేకుండా చూడాలని ఎమ్మెల్యే సూచించారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తా

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

మన్సూరాబాద్, ఏప్రిల్ 16: నాగోల్ డివిజన్ పరిధి అయ్యప్పకాలనీ సంక్షేమ సంఘం సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కలిసి కాలనీలో నెలకొన్న యూజీడీ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. వనస్థలిపురం, మన్సూరాబాద్ డివిజన్, బీఎన్‌రెడ్డినగర్, హయత్‌నగర్ డివిజన్ల పరిధిలోని వందలాది కాలనీల డ్రైనేజీ, వర్షపునీరు అయ్యప్పకాలనీ నుంచి వెళ్లే యూజీడీ పైపులైన్ ద్వారా దిగువకు వెళ్తున్నదని తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉండటం వలన అధికారులు ఇతర పనుల్లో బిజీగా ఉన్నారని ఎన్నికల అనంతరం కాలనీలో నెలకొన్న సమస్యను పరిష్కరింపజేస్తానని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింహాచారి, రవికాంత్‌శర్మ, సుదర్శన్, గోపాల్ పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

కందుకూరు. ఏప్రిల్ 16 : విద్యుత్ సమస్యతో పంట పొలాలు ఎండటం లేదని రంగారెడ్డి జిల్లా విద్యుత్ ఎస్ఈ గోపయ్య తెలిపారు. సోమవారం మండల పరిధిలోని దాసర్లపల్లి తండాకు వెళ్లిన మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి దగ్గరకు గిరిజన రైతులు వచ్చి తమ పంట పొలాలు విద్యుత్ లేక ఎండుతున్నాయని గోడు వినివించుకున్నారు. దీంతో విద్యుత్ అధికారులు స్పందించి మంగళవారం తండాకు వెళ్లి గిరిజనుల పంట పొలాలను పరిశీలించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. జంగు పంట పొలం వద్దకు వెళ్లి పరిశీలించగా విద్యుత్ సమస్య కాదని బోర్లలో నీరు అడుగంటి నడక పోవడంతో పంటలు ఎండుతున్నాయని ఏఈ గోపయ్య తెలిపారు. డీఈ రాజారాంరెడ్డి, ఏడీ కేవీన్‌రెడ్డి, ఏఈ రమేశ్‌గౌడ్ ఉన్నారు.

మానవ హక్కులను పరిరక్షించాలి

ఎల్బీనగర్ , ఏప్రిల్ 16: భారత రాజ్యాంగం ప్రసాదించిన స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం అందరికీ అందుబాటులో ఉండాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ మనోహర్ మూలే అన్నారు. కొత్తపేట మోహన్‌నగర్‌లోని మానస చిన్నారుల ఆరోగ్య వైకల్యాల అధ్యాయన కేంద్రంలో మంగళవారం దివ్యాంగుల మానవ హక్కుల పరిరక్షణ అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యుడు మనోహర్ మూలే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఓయూ న్యాయశాస్త్ర ప్రొఫెసర్ జీబీ రెడ్డి, మానసిన వైద్యశాల డాక్టర్ అనిత, జాతీయ మావన హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి, మానస ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ మెర్సీ మధురిమ, కోశాధికారి మధన్‌మోహన్ రెడ్డి, వనజ, గీత, వెంకమ్మ, దినేశ్‌కుమార్, సుబ్బారావు, రామచంద్ర, విష్ణుబట్ల, కృష్ణ చైతన్య, సుమతి తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు అంబేద్కర్

జయంతి ఉత్సవాల్లో మాట్లాడుతున్న ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు

హయత్‌నగర్, ఏప్రిల్ 16 : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గొప్పతనంతోనే ప్రపంచం భారత దేశంవైపు చూస్తున్నదని ఆర్టీసీ సంస్థ గ్రేటర్ హైదరాబాద్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు కొనియాడారు. హయత్‌నగర్ డిపో-2లో ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అంబేద్కర్ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డైరెక్టర్ వెంకటేశ్వర్లు, హైదరాబాద్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ శ్రీనివాస్, హయత్‌నగర్ సహాయ రీజినల్ మేనేజర్ సుచరిత హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హయత్‌నగర్ డిపో-1 మేనేజర్ విజయ్, డిపో-2 మేనేజర్ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యమంలో ముందుండి నడిపించేది పాటే..

సినీ, గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ

సమావేశంలో మాట్లాడుతున్న సుద్దాల అశోక్ తేజ

కొండాపూర్, ఏప్రిల్ 16 : ఉద్యమం ఏదైనా సరే మనిషిని ముందుండి నడిపించేది పాటేనని ప్రముఖ సినీ, గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ అన్నారు. మానవ చరిత్రలో ఆదిమ కావ్యం పాటేనని, అది శ్రమ నుంచే పుట్టిందని ఉత్పత్తి ప్రక్రియలోనూ కాయకష్టంలోనూ పనితో పాటే పాట వర్ధిల్లిందని ఆయన వివరించారు. యూనివర్సిటీ ఆఫ్ గ్రాంట్స్ కమిషన్ మాళవీయ మిషన్ ఉపాధ్యాయ శిక్షణా కేంద్రం, కేంద్రీయ విశ్వవిద్యాలయం హైదరాబాద్, కళాశాల విద్యాశాఖ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఏపీలోని డిగ్రీ కళాశాలల తెలుగు అధ్యాపకులకు కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం(సామర్థ్యాల నిర్మాణ కార్యక్రమం) ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యూజీసీ, మాళవీయ మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో పది రోజుల పాటు కొనసాగుతుంది. అధ్యాపకుల సహాయాచార్యులకు ఆచార్యులకు శిక్షణ ఇవ్వడం ద్వారా ఉన్నత విద్యా ప్రమాణాలను పెంపొందించడంలోనూ, పరిశోధనా పద్ధతులను, ప్రమాణాలను రూపకల్పన చేయడంలోనూ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 16 : అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేందర్ రెడ్డి వివరాల ప్రకారం.. మండలంలోని కేబిదొడ్డి గ్రామానికి చెందిన బైండ్ల లక్ష్మణ్(42) భార్య పిల్లలతో కలిసి తాపీమేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. లక్ష్మణ్ పెద్దకొడుకు బాల్ రాజ్ పెయింటింగ్ పనిచేస్తూ సోమవారం శంకర్‌పల్లి మండలం పొద్దుటూరు గ్రామానికి వెళ్లాడు. కాగా.. లక్ష్మణ్ మృతి చెందాడని మంగళవారం బాల్‌రాజ్‌కు సమాచారం అందింది. వెంటనే అతను వచ్చి చూడగా శరీరంపై చీమలు తిన్నట్లు గుర్తులు ఉన్నాయి. కాగా.. అతడి తల్లి నవనీత, చిన్నకొడుకు అనిల్‌తో కలిసి శంషాబాద్‌లో ఉండి తిరిగి ఇంటికి వచ్చింది. దీంతో ఆమెపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.